క్లుప్తంగా

విస్తృత ప్రచారం చేయండి



మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ అప్పారావు

కల్లూరురూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమంపై విస్తృత ప్రచారం చేయాలని జెడ్పీ సీఈఓ అప్పారావు కోరారు. బుధవారం కల్లూరులో నిర్వహించిన ప్రజాప్రతినిధుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజాపాలన గ్రామ సభల్లో ఎలాంటి ఇబ్బందుల కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ రవికుమార్, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు ఎండీ ఇస్మాయిల్, తదితరులు పాల్గొన్నారు.

భట్టిని కలిసిన కాంగ్రెస్ నాయకులు



డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్కను సత్కరిస్తున్న కాంగ్రెస్ నాయకులు

చింతకాని: డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్కను మండల పరిధిలోని రామకృష్ణాపురం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు బుధవారం హైద్రాబాద్‌లోని ప్రజాభవన్‌లో కలిసి పుష్పగుచ్ఛం అందించి.. శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా గ్రామానికి సంబంధించిన సమస్యలను భట్టి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన భట్టి విక్రమార్క సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు తూము అంజయ్య, యువజన నాయకులు కొర్లపాటి అంజి, పిల్లి శ్రీను, దేవేంద్రం తదితరులు పాల్గొన్నారు.

నాచారం దేవాలయంలో ప్రత్యేక పూజలు



నాచారం దేవస్థానంలో పూజలు చేస్తున్న తుమ్మల యుగంధర్

ఏన్కూరు: మంత్రి తుమ్మల నాగేశ్వరావు కుమారుడు తుమ్మల యుగంధర్ మండలంలోని నాచారం శ్రీ అద్భుత వేంకటేశ్వరస్వామి దేవస్థానాన్ని బుధవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు స్వాగతం పలికారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తుమ్మల అభిమానులు రాధకృష్ణ, మేడ ధర్మారావు,శ్రీను, వక్కంతుల నాగార్జున పాల్గొన్నారు.

ఎమ్మెల్యే రాగమయికి ఎంవీఐ సత్కారం



ఎమ్మెల్యే రాగమయికి పూలమొక్క అందిస్తున్న ఎంవీఐ వెంకటపుల్లయ్య

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయిని సత్తుపల్లి రవాణా శాఖాధికారి సంగం వెంకటపుల్లయ్య బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువాతో సత్కరించి మొక్కను అందించారు. అదేవిధంగా బెటాలియన్ కమాండెంట్ రాములు, ఎస్సైలు, ఆర్ఎస్‌లు మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ శ్రీనివాసరావు

కొణిజర్ల: మండలంలోని పెద్దమునగాలలో బుధవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సర్పంచ్ పరికపల్లి శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతుల ధాన్యానికి సరైన మద్దతుధర ఇచ్చి కొనుగోలు చేస్తామని చెప్పిన ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి ఉందన్నారు. రైతులు కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు కంచు బీరయ్య, సోల శ్రీను, దాసరి వీరబాబు, వెంకటేశ్వర్లు, భిక్షం తదితరులు పాల్గొన్నారు.

మా ఊరికి బస్సేది..

అందని 'మహాలక్ష్మి' పథకం

- పల్లెలకు చేరని ఆర్టీసీ బస్సులు
- లబ్ధిపొందలేకపోతున్న మహిళలు
- పట్టణ కేంద్రానికి రావాలంటే ఆటోలే ప్రత్యామ్నాయం
- ఎమ్మెల్యే హెచ్చరించినా మారని ఆర్టీసీ తీరు



ఆర్టీసీ సేవలకు నోచుకోని కేజీ సిరిపురం గ్రామం వ్యూ



ఆర్టీసీ డీఎంతో ఫోన్ మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాందాస్ నాయక్ (ఫైల్)

అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఉచితంగా బస్సుల్లో ప్రయాణించే సౌకర్యాన్ని కల్పించింది. ఈ మేరకు మహిళలు కండక్టర్‌కు ఏదైనా గుర్తింపు కార్డు చూపించి ఆర్టీసీ సేవలను వినియోగించుకుంటున్నారు. ఇంతవరకు బాగానే ఉన్నా.. కొన్ని గ్రామాలకు బస్సులు రాకపోవడంతో వారంతా మహాలక్ష్మి పథకం కింద ఆర్టీసీ సేవలు వినియోగించుకోలేక పోతున్నారు. దీంతో వారు మహాలక్ష్మి పథకం పేరుకేనా.. మేమేం పాపం చేశామని ఆవేదన వ్యక్తం చేశారు.

వైరారూరల్: వైరా నుంచి మధిర, జగ్గయ్యపేటకు వెళ్లే రహదారికి అనుసంధానంగా ఉన్న గ్రామాలకు మినహా గ్రామీణ ప్రాంతాలకు ఆర్టీసీ సేవలు చేరకపోవడంతో మహిళలు ఉచిత బస్సు ప్రయాణాలకు నోచుకోవడం లేదు. ఇప్పటికే గ్రామీణ ప్రాంతాల మహిళలు ఖమ్మం, తదితర ప్రాంతాలకు వెళ్లేందుకు వైరా పట్టణ కేంద్రానికి రావాలంటే ఆటోలే ప్రత్యామ్నాయంగా మారాయి. దీంతో ఆటోవాలలు ఇదే అదునుగా భావించి అందినకాడికి దండుకుంటున్నారు. ఏళ్ల తరబడి సమస్య ఇదే విధంగా పునరావృతం అవుతున్నా.. ఆర్టీసీ అధికారులు మాత్రం పల్లెలకు ఆర్టీసీ సేవలను మెరుగుపర్చడంలో వైఫల్యం చెందుతున్నారని పలువురు పెదవిరుస్తున్నారు.

ఇక్కట్లు పడుతున్న విద్యార్థినులు..

ఉచిత బస్సు ప్రయాణానికి గుర్తింపుకార్డు చూపించి ప్రయాణించవచ్చని ప్రభుత్వం స్పష్టం చేసిన నేపథ్యానా కళాశాలలకు వెళ్లే విద్యార్థినులు ఇకపై ఉచితంగా ప్రయాణించవచ్చు అని సంబురపడే లోపే ఆర్టీసీ సేవలు తమ ప్రాంతానికి రావని నిరుత్సాహ పడుతున్నారు. మండలంలోని స్టేజీపినపాక, సిరిపురం, నారపునేనిపల్లి, పుణ్యపురం, లింగన్నపాలెం, గరికపాడు, దాచాపురం గ్రామాలకు చెందిన వందలాది మంది విద్యార్థినులు ఇంటర్మీడియట్, డిగ్రీ, బీటెక్ తదితర ఉన్నత చదువులకు నిత్యం వైరా పట్టణ కేంద్రానికి రావాల్సి ఉంది. ఏళ్ల తరబడి నుంచి ఇటుగా రవాణా మార్గం ఉన్నప్పటికీ బస్సు సౌకర్యం లేకపోవడంతో విద్యార్థినులు పట్టణ కేంద్రం వరకు ఆటోలో వచ్చి ఇక్కడి నుంచి కళాశాలలకు వెళ్లేందుకు ఆర్టీసీ బస్సులను ఆశ్రయిస్తున్నారు. ప్రస్తుతం ఆర్టీసీ ఉచిత ప్రయాణ సేవలు అందుబాటులో ఉన్నప్పటికీ గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణ కేంద్రాలకు ఆర్టీసీ బస్సులు లేకపోవడంతో విద్యార్థినులు ఆటోలో ప్రయాణరూపంలో రవాణా ఛార్జీలు భారంగా మారినట్లు తెలుస్తోంది.

బీటీ రోడ్లు ఉన్నా ఫలితం శూన్యమే..

మండలంలోని గ్రామీణ ప్రాంతాలకు వెళ్లేందుకు బీటీ రోడ్లు సౌకర్యవంతంగా ఉన్నాయి. గత కొన్నేళ్ల క్రితం రూ.కోట్లు వెచ్చించి సిరిపురం నుంచి ఎన్టీఆర్ జిల్లాలోని నెమలికి సమీపంలో ఉన్న దాచాపురం గ్రామ శివారు వరకు డబుల్ బీటీ రోడ్డును నిర్మించారు. అదే విధంగా ప్రస్తుతం ముసలిమడుగు నుంచి నూతన ముసలిమడుగులోని ఎస్టీ గురుకులం వరకు బీటీ రోడ్డును నిర్మించారు. అంతేకాకుండా రెబ్బవరం నుంచి ఖానాపురం, గన్నవరం గ్రామాలకు.. గొల్లపూడి నుంచి అష్టగుర్తి, గొల్లెనపాడు గ్రామాలతో పాటు పాలడుగు నుంచి వల్లాపురం వెళ్లేందుకు బీటీ రోడ్లు విశాలంగా నిర్మించినప్పటికీ ఆర్టీసీ మాత్రం ఒక్క పల్లె వెలుగు సర్వీసు కూడా ప్రారంభించలేదు. కావున అధికారులు ఈ మార్గం వైపు పల్లె వెలుగు సేవలను ప్రారంభిస్తే.. గిరిజన సంక్షేమ బాలిక పాఠశాలల్లో చదివే విద్యార్థులు, తల్లిదండ్రులకు ఊరట కలగనుంది.

ఎమ్మెల్యే హెచ్చరించినా మారని తీరు..

కాంగ్రెస్ ప్రభుత్వం గత నెల 9న మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించింది. దీంతో గత నెల 10న ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్ వైరా బస్టాండ్ ఆవరణలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ క్రమంలో ఎమ్మెల్యే సభావేదిక మీద ఉన్నప్పుడు వైరా–నెమలి రోడ్డులో బస్సులు నడపాలని ఆయా గ్రామల ప్రజలు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఎమ్మెల్యే ఆర్టీసీ డీఎంకు ఆదేశించారు. పలుమార్లు ఫోన్‌లో కూడా ఆర్టీసీ అధికారులతో మాట్లాడినా.. బస్సు సర్వీస్ ప్రారంభించలేదు. మరల ఈ నెల 2న విప్పలమడక గ్రామంలో ప్రజాపాలన గ్రామసభ నిర్వహించగా ఎమ్మెల్యే పాల్గొన్నారు. దీంతో సర్పంచ్ తుమ్మల జానీపాపయ్య, గ్రామస్తులు కలిసి వైరా–నెమలి మార్గంలో బస్సులు నడపాలని ఎమ్మెల్యేకు వినతిపత్రం అందించగా.. ఎమ్మెల్యే స్పందించి మధిర ఆర్టీసీ డీఎంకు ఫోన్ చేసి తక్షణమే బస్సులు నడపాలని లేకపోతే డీపో ముందు ధర్నా చేస్తామని హెచ్చరించారు. దాంతో డీఎం స్పందించి సమస్యను ఆర్ఎం దృష్టికి తీసుకెళ్లానని తెలిపారు.

అన్ని వర్గాల ప్రజలకు లబ్ధి..

ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు ఎమ్మెల్యే హెచ్చరికలను పరిగణలోకి తీసుకోని వైరా–నెమలి రోడ్డు మార్గంలో ఆర్టీసీ బస్సులు నడుపుతారా..? లేక ఎమ్మెల్యే ప్రజల సౌకర్యార్థం మధిర ఆర్టీసీ డిపో ముందు ధర్నా చేస్తారా..? అనేది ప్రశ్నార్థకంగా మారింది. ఏదేమైనా త్వరితగతిన ఇటుగా బస్సులను నడిపితే విద్యార్థులే కాకుండా అర్హత కలిగిన ప్రతి మహిళకు ఉచితంగా ప్రయాణం చేయడమే కాకుండా అన్ని వర్గాల ప్రజలు లబ్ధిపొందుతారు.

ఆటోలే ప్రత్యామ్నాయం..



మా దాచారం గ్రామానికి గతంలో బస్సు సౌకర్యం ఉండేది. కాలక్రమేనా సర్వీసును రద్దు చేశారు. మా గ్రామం నుంచి వైరా పట్టణ కేంద్రానికి వెళ్లేందుకు సుమారు 19 కిలో మీటర్లు దూరం ఉంది. ఇటుగా బస్సు సర్వీసులు లేనందున ఇప్పటికీ ఆటోలనే ఆశ్రయిస్తున్నాను. ఒక వైపు ప్రభుత్వం మహిళలకు మహాలక్ష్మి ద్వారా ఉచిత బస్సు ప్రయాణాలు కల్పించిన అన్ని విధాలుగా అర్హత ఉండి కూడా బస్సు సర్వీస్‌లు లేనందున పథకాన్ని సద్వినియోగం చేసుకోలేకపోతున్నాం. అధికారులు బస్సు సర్వీసులను పునఃప్రారంభించాలి.

– ముక్కార వరలక్ష్మి, దాచాపురం

సర్వీసులు ప్రారంభించాలి..



మా గ్రామానికి తరబడి ఆర్టీసీ సర్వీసు లేకుండా పోయింది. మండల, జిల్లా కేంద్రాలకు వెళ్లాలంటే ఆటోలు, ద్విచక్ర వాహనాలే దిక్కయ్యింది. పట్టణ కేంద్రాలకు వెళ్లేందుకు నాలుగు కిలోమీటర్లు ఆటోల్లో వెళ్లి అక్కడ ఆర్టీసీ కోసం గంటల తరబడి ఎదురుచూడాల్సిన పరిస్థితి. మహిళ సౌకర్యార్థం వల్లాపురం నుంచి ఖమ్మం వరకు పూర్తి స్థాయిలో బస్సు సర్వీసులను ప్రారంభిస్తే మహిళలతో పాటు అత్యవసర సమయాల్లో అన్ని వర్గాల ప్రజలకు ప్రయోజనం కలుగుతుంది.

– తుమ్మల రమాదేవి, వల్లాపురం

లారీ డ్రైవర్ల నిరసన



నిరసన తెలుపుతున్న లారీ డ్రైవర్లు

మధిర: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన హిట్ అండ్ రన్ కేసులో రూ.7 లక్షల జరిమానా, 10 సంవత్సరాల జైలు శిక్షను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ మధిర డివిజన్ లారీ డ్రైవర్స్ యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం మధిర పట్టణంలోని వైఎస్సార్ చౌరస్తాలో నిరసన తెలిపారు. ముందుగా సీఐటీయూ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు శీలం నరసింహారావు మాట్లాడుతూ.. హిట్ అండ్ రన్ కేసుల రూల్స్‌కు వ్యతిరేకంగా కార్మికులు ఈ నిరసన కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో తేలప్రోలు రాధాకృష్ణ, మధు, యూనియన్ నాయకులు నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

పదవీ విరమణ ప్రతీ ఉద్యోగికి సహజం



సరవయ్యను సన్మానిస్తున్న ఎంఈఓ జయరాజు, సర్పంచ్ స్రవంతి

కారేపల్లి: ఉద్యోగంలో చేరి విధులు నిర్వహించే ప్రతి ఒక్కరికి పదవి విరమణ సహజమని సింగరేణి మండల విద్యాశాఖ అధికారి జయరాజు అన్నారు. బుధవారం కారేపల్లి ప్రాథమిక పాఠశాల (చిన్నబడి)లో అటెండర్‌గా విధులు నిర్వర్తించి, పదవీవిరమణ పొందిన జూపల్లి సరవయ్యను ఎంఈఓ సన్మానించారు. ఈ సన్మాన కార్యక్రమంలో సింగరేణి సర్పంచ్ ఆదెర్ల స్రవంతి, హెచ్ఎం అన్నపూర్ణ, పీఆర్‌టీయూ జిల్లా నాయకులు బాలిన వెంకటరెడ్డి, గ్రామ పెద్దలు ఇమ్మడి తిరుపతిరావు, పాలిక సారయ్య, జూపల్లి కృష్ణ, రాము తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సావిత్రీబాయి పూలే జయంతి



సత్తుపల్లిటౌన్: మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ విజయకుమార్



కొణిజర్ల: పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు



తల్లాడ: అన్నారుగూడెం జెడ్పీ పాఠశాలలో..

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లి జేవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సావిత్రీబాయి పూలే జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి ప్రిన్సిపాల్ విజయకుమార్, అధ్యాపకులు పూలమాల వేసి నివాళులర్పించారు. పూలే జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రామచంద్రరావు, రాజ్యలక్ష్మి, శ్రీకాంత్, రాజ్‌కుమార్, మురళీ, ఆంజనేయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కొణిజర్ల: భారత దేశంలో తొలి మహిళా ఉపాధ్యాయిని, సంఘసంస్కర్త, విద్యావేత్త సావిత్రీబాయి పూలే జయంతి వేడుకలను గురువారం కొణిజర్ల సమీపంలోని బస్వాపురం గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ హెడ్ మాస్టర్ బి.వెంకటేశ్వర్లు ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు బి.కృష్ణారావు, సక్రామ్, భాస్కర్, నాగేశ్వరరావు, నెహ్రూ, అశోక్‌కుమార్, రాంకిషన్ తదితరులు పాల్గొన్నారు.

తల్లాడ: తల్లాడ మండలం అన్నారుగూడెం, తల్లాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం సావిత్రీ పూలే జయంతిని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గురుకులంలో సైన్స్‌ఫెయిర్ రంగోలి



రంగోలిలో పాల్గొన్న విద్యార్థులతో ఉపాధ్యాయులు, జన్యు ఫౌండేషన్ సభ్యులు

వైరా: వైరాలోని తెలంగాణ గురుకుల బాలికల పాఠశాలలో బుధవారం సైన్స్‌ఫెయిర్, రంగోలి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. జన్యు లాబ్స్ ఇన్ ఏ బాక్స్ కార్యక్రమంలో భాగంగా జన్యు ఫౌండేషన్, బ్రిస్టల్ వారి ఆధ్వర్యంలో బోధనా, అభ్యసన పరికరాలు సైన్స్, గణిత కృత్యముల ద్వారా విద్యార్థులు నేర్చుకుంటున్న విషయాలను ముగ్గుల ద్వారా ప్రదర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ రత్నమాల మాట్లాడుతూ.. వినూత్న కార్యక్రమాలు నిర్వహించి విద్యార్థులలో శాస్త్రీయ పరిజ్ఞానాన్ని పెంపుందించుకునేందుకు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న జన్యు ఫౌండేషన్ వారిని అభినందించి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, జన్యు ఫౌండేషన్ సభ్యులు శివకుమార్, జానీ, పాల్గొన్నారు.

గుండెపోటుతో మంగపేట ఎంపీడీఓ మృతి



శ్రీధర్ (ఫైల్)

మధిర: మధిర పట్టణానికి చెందిన ములుగు జిల్లా మంగపేట ఎంపీడీఓ కర్నాటి శ్రీధర్(55) బుధవారం గుండెపోటుతో మృతి చెందారు. ఆయనకు భార్య, కుమార్తె ఉన్నారు. ఆయన గతంలో మధిర మండల పరిషత్ కార్యాలయంలో సూపరిండెంట్‌గా పనిచేశారు. ఇక్కడ నుంచి పదోన్నతితో బదిలీపై మంగపేట ఎంపీడీఓగా వెళ్లారు. ఆయన మృతి పట్ల ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల నాయకులు, మండల పరిషత్ సిబ్బంది సంతాపం తెలిపారు.

'అయోధ్య' అక్షింతల శోభాయాత్ర



శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు

మధిర: మధిర మండలంలో బుధవారం అయోధ్య పూజిత అక్షింతల శోభాయాత్రను భక్తులు వైభవంగా నిర్వహించారు. స్థానిక శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయం నుంచి శ్రీ వేణుగోపాల స్వామి ఆలయం మీదుగా బంజారా కాలనీలో ఉన్న శ్రీ లక్ష్మి పద్మావతి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయం వరకు శోభాయాత్ర కొనసాగింది. అక్షింతలు పంపిణీలో భాగంగా కలశం తలపై పెట్టుకుని భక్తులు గడపగడపకు వెళ్లి అక్షింతలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా భక్తులు మాదిరాజు దుర్గాప్రసాద్, వనం వెంకట వరప్రసాద్ మాట్లాడుతూ.. అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలను దైవమందరంలో ఉంచి పూజించి, జనవరి 22న స్వామి ప్రాణప్రతిష్ఠ రోజున సాయంత్రం 5 దీపాలు వెలిగించి.. రెండు దీపాలను దేవుని మందిరంలో, మరో రెండు దీపాలను గడపకు కుడివైపున, ఎడమ వైపున ఉంచాలని, మరొకటి తులసి కోటలో పెట్టి భక్తితో పూజించి అక్షింతలను తలమీద స్వీకరించాలని సూచించారు. ఇది దేశ ప్రతిష్టను, జాతి గౌరవాన్ని పెంపొందిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయ కమిటీ చైర్మన్ పల్లపోతు ప్రసాదరావు, పాపట్ల రమేష్, కుంచం కృష్ణారావు, చిలువేరు సాంబశివరావు, శ్రీనివాసరావు, బాబ్జ పాల్గొన్నారు.

దయానంద్ జన్మదిన వేడుకలు



పెనుబల్లి: కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

తల్లాడ/కల్లూరురూరల్/పెనుబల్లి: జిల్లా కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ మట్టాదయానంద్ జన్మదిన వేడుకలు బుధవారం తల్లాడలోని స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో, కల్లూరులోని లింగాలలో, పెనుబల్లిలోని ఆర్కే ఫంక్షన్ హాల్‌లో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా లింగాలలో దయానంద్, తల్లాడలో స్థానిక నాయకులు కేక్ కట్‌చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు లోకేష్, డి.వెంకటేశ్వరావు, వి.సాంబశివరావు, టి.నాగేశ్వరరావు, డి.మంగపతి, సురేష్, దగ్గుల రఘుపతిరెడ్డి, కాపా సుధాకర్, నాగిరెడ్డి, వెంకటేశ్వరరావు, రామలక్ష్మణ్, మొక్కా బసవయ్య, అనుమోలు కృష్ణ, సోమరాజు, రామారావు, బాపిరెడ్డి, బొర్ర కోటేశ్వరరావు, వెంకటేశ్వరరావు, కమలాకర్‌రావు, ఎస్‌కె కరీముల్లా, విజయకుమారి, చిన్నస్వామి, బోంతు మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

ఫైర్ ఆఫీసర్‌కు సేవా పురస్కారం



ఫైర్ ఆఫీసర్ వెంకటేశ్వరరావు

మధిర: తెలంగాణ రాష్ట్ర ఫైర్ సర్వీస్ సేవా పురస్కారానికి మధిర ఫైర్ ఆఫీసర్ యర్రగుంట వెంకటేశ్వరరావు ఎంపికయ్యారు. నూతన సంవత్సరం సందర్భంగా ప్రభుత్వం పోలీస్ శాఖలోని వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందిస్తున్న వారికి సేవా పురస్కారాలను అందజేస్తుంది. దీనిలో భాగంగా మధిర ఫైర్ స్టేషన్‌లో ఫైర్ ఆఫీసర్‌గా సేవలు అందిస్తున్న యర్రగుంట వెంకటేశ్వరరావుకు తెలంగాణ రాష్ట్ర ఫైర్ సర్వీస్ సేవా పథకాన్ని అందించారు. మధిర నియోజకవర్గ పరిధిలోని సుమారు 100 గ్రామాలకు ఒకే ఒక ఫైర్ స్టేషన్ ఉన్నప్పటికీ వెంకటేశ్వరరావు తన సిబ్బంది సహకారంతో సకాలంలో ప్రమాద ఘటనా స్థలాలకు చేరుకొని అగ్ని ప్రమాదాలను సకాలంలో నివారిస్తున్నారు. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన సేవలు అందిస్తూ ప్రజల ఆదరాభిమానాలను చూరగొన్నారు. ఆయన 2013లో జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా బెస్ట్ లీడింగ్ ఫైర్‌మెన్ అవార్డు, 2016లో కృష్ణ పుష్కరాలు సందర్భంగా విశిష్ట సేవా పురస్కారం, 2020లో రాష్ట్రపతి పురస్కారాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా బుధవారం ఫైర్ స్టేషన్‌లో సిబ్బంది చేతుల మీదుగా ఫైర్ ఆఫీసర్ వెంకటేశ్వరరావును ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలు, సిబ్బంది సహకారంతో అగ్ని ప్రమాదాలను సకాలంలో నివారించగలుగుతున్నట్లు తెలిపారు. సేవా పథకం అందించిన రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

ఏర్పాట్లలో లోపంతో ఇక్కట్లు

వేంసూరు: మండలంలోని రామన్నపాలెం పంచాయతీలో బుధవారం ఏర్పాటు చేసిన ప్రజాపాలన గ్రామసభలో సరైన ఏర్పాట్లు చేయకపోవడంతో ప్రజలు అనేక ఇబ్బందులు పడ్డారు. అధికారులు జనాభాకు అనుగుణంగా కౌంటర్లు ఏర్పాటు చేయాల్సి ఉండగా పట్టించుకోకపోవడంతో దరఖాస్తు దారులు అవస్థలు పడ్డారు. మూడు గంటల సమయం దాటినప్పటికీ దరఖాస్తు తీసుకునే సౌకర్యం గ్రామసభలో కానరాలేదు. ఇరుకు ప్రదేశంలో సభ ఏర్పాటు చేయడంతో కనీసం కూర్చునేందుకు కూడా ఖాళీ ప్రదేశం లేకుండా పోయింది. దీంతో గ్రామస్తులు కౌంటర్లు ఏర్పాటు చేయాలని పంచాయతీ కార్యదర్శిని అడగడంతో.. కార్యదర్శి ఏర్పాట్లు చేసే వరకు ఆగలేరా.. అంటూ దురుసు సమాధానం ఇస్తుందని ప్రజలు వాపోయారు. గ్రామ అధికారులైన ఎంపీడీఓ, ఎంపీఓ, మండల ప్రత్యేకాధికారి ఉన్న సభలో అధికారులు ఇలా నిర్లక్ష్యంగా వ్యవహరించడం పట్ల గ్రామస్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

మహిళలకు ఉచిత ప్రయాణం రద్దు చేయాలి



కారేపల్లి క్రాస్‌రోడ్డులో ధర్నా చేస్తున్న ఆటోడ్రైవర్లు

కారేపల్లి: రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో కల్పిస్తున్న ఉచిత ప్రయాణాన్ని రద్దు చేయాలని ఆటో డ్రైవర్లు డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని కారేపల్లి క్రాస్‌రోడ్డులో ఖమ్మం–ఇల్లందు ప్రధాన రహదారిపై నిరసన వ్యక్తం చేస్తూ.. రాస్తారోకో నిర్వహించారు. దీంతో ఇరువైపులా వాహనాలు నిలిచిపోవటంతో ప్రయాణికులు అసౌకర్యానికి గురయ్యారు. అంతకుముందు ఆటోవాలాలు కారేపల్లి క్రాస్‌రోడ్డు వరకు ఆటోలతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆటోలను నడుపుకుంటూ జీవనోపాధి పొందుతూ కుటుంబాలను పోషించుకుంటున్నామని, ఈ పథకం మహిళలక మంచి చేసినా.. మా జీవితాల్లో బాధను మిగిల్చిందన్నారు. ఇకనైన ఈ పథకాన్ని రద్దు చేసి ఆటోడ్రైవర్ల కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆటోడ్రైవర్లు నాగవెల్లి ప్రభాకర్, షఫీ, దుండి నాగేశ్వరావు, దంతాల వెంకట్, జావిద్, మహ్మద్‌పాషా, తోడేటి రమేష్, దుండి సైదులు, అక్కుల శ్రీను, మేకల సతీష్, గిరిబోయిన వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపాలన.. దరఖాస్తుల స్వీకరణ

అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించాలని పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు తెలిపారు. బుధవారం మండలంలోని పలు గ్రామాల్లో నిర్వహించిన ప్రజాపాలన గ్రామసభల్లో వారు హాజరై లబ్ధిదారుల దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజాపాలన నిరంతర ప్రక్రియ అని ప్రజల నుంచి కార్యదర్శులు దరఖాస్తులు స్వీకరిస్తారని తెలిపారు. ప్రతి గడపకూ సంక్షేమ పథకాలు చేరవేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



కారేపల్లి : దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు



మధిరరూరల్: మాట్లాడుతున్న మున్సిపల్ చైర్ పర్సన్ మొండితోక లత



కల్లూరులో..



వైరా: దరఖాస్తులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే రాందాస్ నాయక్



ముదిగొండ: దరఖాస్తుదారులకు రశీదులు అందజేస్తున్న ఎంపీడీఓ అశోక్‌కుమార్